అధ్వానంగా ఎఫ్ఓబీల నిర్వహణ



- పనిచేయని ఎస్కలేటర్లు, లిఫ్టులు
- అవస్థలు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు

సనత్‌నగర్: రోడ్డు దాటేందుకు నిర్మించిన ఫుట్ ఓవర్ బ్రిడ్జి (ఎఫ్ఓబీ)ల నిర్వహణను అధికారులు గాలికొదిలేశారు. వీటిని నిర్మించిన నిర్మాణ సంస్థలు కొన్నేళ్ల పాటు నిర్వహణ బాధ్యతలను చేపట్టాల్సి ఉండగా, ఆయా సంస్థలు ఎఫ్ఓబీల నిర్వహణ విషయంలో చేతులెత్తేశాయి. ఫలితంగా రోడ్డు దాటాలంటే అపసోపాలు పడాల్సిందే. ముఖ్యంగా ఎస్కలేటర్లు, లిఫ్టులు పనిచేయడం లేదు. దీంతో మెట్ల మార్గంలో నానా తంటాలు పడుతూ రోడ్డు దాటాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. దారి పొడవునా ఎత్తైన మెట్రో డివైడర్లు కారణంగా ఎక్కడపడితే అక్కడ రోడ్డు దాటే పరిస్థితులు లేవు. ఈ క్రమంలో సుదూర ప్రాంతాల్లోని యూటర్న్‌ల వద్దకు వెళితే.. అక్కడ కూడా లెక్కకు మిక్కిలిగా వచ్చే వాహనాలను తప్పించబోయి ప్రమాదాలకు గురవుతున్న సంఘటనలున్నాయి. అయితే రోడ్డు దాటే పాదచారుల అవస్థలకు చెక్ పెట్టేందుకు ఫుడ్ ఓవర్ బ్రిడ్జి (ఎఫ్ఓబీ)ల నిర్మాణాలను జీహెచ్ఎంసీ చేపట్టింది. వాటి ద్వారానైనా సురక్షితంగా రోడ్డు దాటుదామంటే పాదచారులకు అక్కడ కూడా చేదు అనుభవమే ఎదురవుతుంది. ముఖ్యంగా వృద్ధులు, దివ్యాంగులు, మహిళల కోసం లిఫ్టులు, ఎస్కలేటర్లు ఏర్పాటుచేస్తే అవి ఉపయోగంలో లేకుండా పోయాయి. ముఖ్యంగా మోడల్‌కాలనీ కమాన్ వద్ద, బేగంపేట హెచ్‌పీఎస్ ఎదురుగా నిర్మించిన ఫుట్ ఓవర్ బ్రిడ్జిల నిర్వహణ లోపం కారణంగా రోడ్డు దాటే పాదచారులకు అవస్థలు తప్పడం లేదు.



రూ.కోట్లు వెచ్చించి నిర్మించినా.. నెరవేరని లక్ష్యం

మోడల్‌కాలనీ కమాన్ వద్ద ఎఫ్ఓబీ లిఫ్ట్ అసలే పనిచేయడం లేదు. ఒక్కసారి మోడల్‌కాలనీ వైపు లిఫ్ట్ దగ్గర మద్యం బాటిళ్లు పేర్చి ఉన్నాయి. మరోవైపు ఉన్న ఎస్కలేటర్ పనిచేస్తున్నా, అటువైపు వెళ్లే మార్గం కూడా లేదు. ఎర్రగడ్డ రైతుబజార్, సెయింట్ థెరిస్సా చర్చి, ఛాతి, మానసిక, ఆయుర్వేద, ఈఎస్ఐసీ వంటి రాష్ట్ర, జాతీయ స్థాయి ఆస్పత్రులతో పాటు ఇరువైపులా ఉన్న పలు కాలనీల ప్రజలకు ఉపయోగకరంగా ఉండేలా రూ.కోట్లతో ఇక్కడ ఎఫ్ఓబీని నిర్మించారు. ఎస్కలేటర్లు, లిఫ్టులు అందుబాటులో లేనప్పుడు కోట్లు వెచ్చించి ఎందుకు నిర్మించారని పలువురు వాపోతున్నారు.



బేగంపేటలో ఎఫ్ఓబీ తీరు అదే..

బేగంపేట హెచ్‌పీఎస్ వద్ద గత ఐదేళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఎఫ్ఓబీ లిఫ్ట్ పనిచేయడం లేదు. బేగంపేట మహిళా డిగ్రీ కళాశాల, హెచ్‌పీఎస్, మహర్షి విద్యాలయ సంస్థలతో పాటు మయూరిమార్గ్, అల్లంతోటబావి, శ్యాంలాల్ బిల్డింగ్స్ ప్రాంత నివాసితులు రోడ్డు దాటేందుకు వీలుగా ఈ ప్రాంతంలో ఎఫ్ఓబీ ఎంతగానో ఉపయోగపడుతుంది. అయితే లిఫ్ట్ పనిచేయకపోవడంతో ఎత్తైన బ్రిడ్జిని ఎక్కాలంటే వృద్ధులు, మహిళలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు ఆయా ఎఫ్ఓబీల నిర్వహణను పకడ్బందీగా చేపట్టి లిఫ్టులు, ఎస్కలేటర్లను అందుబాటులోకి తీసుకురావాలని పాదచారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

గ్రూప్ 1 అవకతవకలపై ఓయూలో నిరసన


ఓయూ ప్రధాన లైబ్రరీ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్వీ నేతలు, గ్రూప్‌- 1 అభ్యర్థులు

లాలాపేట: గ్రూప్‌- 1లో జరిగిన అవకతవలకు నిరసనగా బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో గురువారం ఓయూలోని ప్రధాన లైబ్రరీ ఎదుట శాంతియుతంగా నిరసన వ్యక్తం చేశారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ ప్రభుత్వానికి వ్యతిరేఖంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చటారి దశరథ్ మాట్లాడుతూ.. గ్రూప్‌- 1 పరీక్ష నిర్వాహణలో విఫలమైన పబ్లిక్ సర్వీస్ కమిషన్ నైతిక బాధ్యత వహిస్తూ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నిరసన చేస్తున్న వారిని ఓయూ పోలీసులు అరెస్టు చేసి అంబర్‌పేట పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో కడారి స్వామి, జంగయ్య, నాగారం ప్రశాంత్, బొల్లు నాగరాజ్, శ్రీకాంత్, నాగేందర్, రాకేశ్ తదితరులు ఉన్నారు.

ప్రైవేట్ టీచర్లకు జీతాలు పెంచాలి

లాలాపేట: రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రైవేట్ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు వేతనాలు పెంచాలనీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ మార్కెట్‌లో పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు లేవన్నారు. పాఠశాల యాజమాన్యాలు స్పందించి కనీస వేతనం రూ. 30 వేలు చెల్లించాలని కోరారు.

తులసీనగర్‌లో పవర్‌బోర్‌కు మరమ్మతులు

సనత్‌నగర్: తులసీనగర్ బస్తీలో 15 రోజులుగా పవర్‌బోర్ చేయక నీటి కోసం ఇబ్బందులు పడుతున్న విషయాన్ని స్థానికులు సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్, కార్పొరేటర్ లక్ష్మీబాల్‌రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. దీంతో వారు వాటర్‌వర్క్స్ సీజీఎంకు విషయం తెలియజేయగా, గురువారం సిబ్బంది పవర్ బోర్ మరమ్మతు పనులు చేపట్టారు. దీంతో సమస్య పరిష్కారం కావడంపై స్థానిక బీఆర్ఎస్ నాయకులు ముచ్చర్ల అంజనేయులు యాదవ్, రామ్మోహన్‌చారి, శంకర్‌గౌడ్, మల్లేశ్ హర్షం వ్యక్తం చేశారు.

ఈసీఐకు వ్యతిరేకంగా ధర్నా


ఎన్నికల కమిషన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

సనత్‌నగర్: భారత ఎన్నికల కమిషన్ తీరుకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం బేగంపేట పోలీస్‌లైన్ చౌరస్తాలో శాంతియుత ధర్నా నిర్వహించారు. టీపీసీసీ ఉపాధ్యక్షురాలు, సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ కోట నీలిమకు రెండు ఓటరు ఐడీ కార్డులు కలిగి ఉన్నారనే ఆరోపణలపై ఈసీఐ నోటీసు జారీ చేయడంపై నిరసన వ్యక్తం చేశారు. సీనియర్ నేత విశాల్ సూదం ఆధ్వర్యంలో జరిగిన ఈ ధర్నాలో పెద్ద ఎత్తున నేతలు, కార్యకర్తలు హాజరై శాంతియుతంగా తమ నిరసన తెలిపారు. చివరగా ఎన్నికల కమిషన్ దిష్టిబొమ్మను దహనం చేశారు.

అధ్యక్ష పోటీలో ఖదీర్ ఖాన్ నామినేషన్


నామినేషన్ వేస్తున్న ఖదీర్ ప్యానెల్

లాలాపేట: ఉస్మానియా యూనివర్సిటీలో ఉద్యోగ సంఘాల ఎన్నికలకు నోటిఫికేషన్ వెలువడిన నేపథ్యంలో వివిధ ఉద్యోగ సంఘాలు, యూనియన్లు నామినేషన్లు వేశారు. ఈ మేరకు గురువారం ఎన్‌జీఓస్ స్టాఫ్ అసోసియేషన్ ఖదీర్ ప్యానెల్ అధ్యక్షుడిగా ఖదీర్ ఖాన్ నామినేషన్ వేశాడు. ఈయనతో పాటు ఉపాధ్యక్షులుగా యాదగిరి, సుధీర్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా బి. వెంకటేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్. మల్లేశ్, సెక్రటరీగా జె. నరసింహ, సెక్రటరీలుగా ఎండీ వసీం అహమ్మద్, ఎస్. సుధాకర్, కోశాధికారిగా ఆర్. నరసింగరావు తదితరులు నామినేషన్ వేసిన వారిలో ఉన్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన



అడ్డగుట్ట: తుకారంగేట్ నందనార్ నగర్ గణపతి ఆలయం సమీపంలో జరుగుతున్న సీసీరోడ్డు మరమ్మతు పనులను గురువారం బీఆర్ఎస్ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా లింగాని శ్రీనివాస్ మాట్లాడుతూ సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్ సహకారంతో డివిజన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. స్థానిక కార్పొరేటర్ లింగాని ప్రసన్న లక్ష్మి ఆదేశాలతో రోడ్డుపనులు పరిశీలించినట్లు తెలిపారు. పనుల్లో నాణ్యత పాటిస్తూ త్వరగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మోహన్, దేవయ్య, శ్రీనివాస్, భాస్కర్, కాలనీ ప్రతినిధులు సురేష్, సమ్మయ్య, జీహెచ్ఎంసీ ఏఈ తివారి, సూపర్‌వైజర్ సలీం తదితరులు పాల్గొన్నారు.

కుట్టుమెషన్ అందజేత

అడ్డగుట్ట: నిరుపేద ప్రజలకు తమవంతు సహాయసహకారాలు అందించేందుకు సెవెన్ రేస్ ఫౌండేషన్ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ సారా తెలిపారు. అడ్డగుట్టలో నిరుపేద కుటుంబానికి చెందిన లీలావతి అనే ఒంటరి మహిళకు గురువారం సెవెన్ రేస్ ఫౌండేషన్ తరుపున కుట్టుమెషన్‌ను అందజేశారు. పేద ప్రజలను ఆదుకునేందుకు ఫౌండేషన్ కృషి చేస్తుందని తెలిపారు.

బాలిక అదృశ్యం

బౌద్ధనగర్: బాలిక అదృశ్యమైన ఘటన వారాసీగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్ర సోలాపూర్‌కు చెందిన రూమర్ అర్వింద్ నెల నుంచి తన తల్లి, కుమార్తెతో కలసి అంబర్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. కుమార్తె (15) రాంనగర్‌లో టైలరింగ్ నేర్చుకుంటుంది. బుధవారం ఉదయం టైలరింగ్ శిక్షణ కోసం వెళ్లి, రాత్రి అయినా ఆమె ఇంటికి రాకపోవడంతో తండ్రి ఫోన్ చేశాడు. మధ్యాహ్నం 12.30కే సాక్షి ఇంటికి వెళ్లిపోయిందని ఆయన సమాధానం ఇచ్చాడు. ఆమె ఫోన్ కూడా స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో బంధువులు, తెలిసిన వాళ్ల దగ్గర ఆచూకీ లేకపోవడంతో ఆయన వారాసీగూడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సమన్వయంతోనే సమస్యల పరిష్కారం

ఎమ్మెల్యే శ్రీగణేశ్

కంటోన్మెంట్: పాలకులు, అధికారుల సమన్వయంతోనే సమస్యల పరిష్కారం సులువు అవుతుందని ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. మారేడుపల్లిలోని ఎల్. శంకర్ నగర్‌లోని డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా రూ.40.5 లక్షల నిధులతో చేపట్టిన డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులకు కార్పొరేటర్ కొంతం దీపికతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కంటోన్మెంట్ అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతోందన్నారు. ముఖ్యంగా సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్తామన్నారు. స్థానిక కార్పొరేటర్ కొంతం దీపిక బీజేపీకి చెందినప్పటికీ, అభివృద్ధి పనుల విషయంలో పదే పదే తనను సంప్రదిస్తూ పరిష్కారం దిశగా కృషి చేస్తుందన్నారు. రాజకీయాలు ఎన్నికలకు మాత్రమే పరిమితం చేస్తూ, అభివృద్ధి విషయంలో కలిసి సాగుదామని పిలుపునిచ్చారు. సుదీర్ఘ కాలంగా ఎల్. శంకర్‌నగర్ మురుగునీటి సమస్యకు పరిష్కారం లభించకపోవడానికి గత పాలకులు, అధికారుల మధ్య సమన్వయలేమియే కారణమన్నారు. చిత్తశుద్ధితో ఫాలోఅప్ చేస్తే ఎలాంటి సమస్యకైనా తగిన పరిష్కారం దొరుకుతుందన్నారు. డివిజన్ పరిధిలోని మారేడుపల్లి హిందూ శ్మశాన వాటిక చుట్టూ రూ.8.5 లక్షలతో ఫెన్సింగ్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు నాగేష్ యాదవ్, బద్రీనాథ్ యాదవ్, సంతోష్ యాదవ్, అరవింద్ యాదవ్, నందికంటి రవి, ధనలక్ష్మి, వరలక్ష్మి, శేఖర్ ముదిరాజ్, బాబూరావు, స్థానిక కాలనీ, బస్తీలవాసులు పాల్గొన్నారు.


మారేడుపల్లిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్, కార్పొరేటర్ దీపిక

బొల్లారం: కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ గురువారం వార్డు 7 పరిధిలోని ఐటీబీ కాలనీ, రవి కాలనీ, బంజారా కాలనీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు అంతర్గత రహదారుల అభివృద్ధి, ఖాళీగా ఉన్న పార్క్ స్థలాన్ని అభివృద్ధి చేసి కమ్యూనిటీ హాల్ నిర్మించాలంటూ తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాని ఈ సమస్యలను త్వరగా పరిష్కరిస్తానని ఎమ్మెల్యే గణేశ్ హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో కాంగ్రెస్ పార్టీ నాయకురాలు నాగినేని సరిత, స్థానికులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

గాంధీలో ఎక్స్‌రే పరికరం ప్రారంభం


ఎక్స్‌రే పరికారాన్ని ప్రారంభిస్తున్న వైద్యులు

గాంధీఆస్పత్రి: సికింద్రాబాద్ గాంధీఆస్పత్రి రేడియాలజీ విభాగంలో అత్యంత అధునాతనమైన ఎక్స్‌రే పరికరం అందుబాటులోకి వచ్చింది. అడిషనల్ డీఎంఈ వాణి, గాంధీ సూపరింటెండెంట్ రాజకుమారి, రేడియాలజీ హెచ్‌ఓడీ రాజేశ్వరీలు 500ఎంఏ ఎక్స్‌రే పరికరాన్ని గురువారం ప్రారంభించారు. గాంధీ రోగులకు మరింత మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేయనున్నట్లు వివరించారు. అనంతరం ఓపీ విభాగం, రేడియాలజీలో కల్పించాల్సిన మౌలిక వసతులు, సౌకర్యాలను పరిశీలించారు. వైస్ ప్రిన్సిపాల్ రవిశేఖర్‌రావు, ఆర్ఎంఓ-1 శేషాద్రి, వైద్యులు, వైద్యవిద్యార్థులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతి కాంగ్రెస్‌తోనే సాధ్యం


ఇళ్ల పట్టాలు అందుకున్న లబ్ధిదారులతో మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు

సికింద్రాబాద్: పేద ప్రజలకు అండగా నిలవడం, వారికి అన్ని విధాల న్యాయం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సీతాఫల్‌మండి డివిజన్ సుభాష్ చంద్రబోస్ నగర్‌లో 28 మంది లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూం ఇళ్ల పత్రాలను గురువారం ఆయన అందచేశారు. నగరంలోని మంత్రుల క్వార్టర్స్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ పేద కుటుంబాలను ప్రగతిపథంలో నిలిపేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. సికింద్రాబాద్ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి ఆదం సంతోష్‌కుమార్ మాట్లాడుతూ 8 ఏళ్ల నుంచి డబుల్‌బెడ్ రూమ్ ఇళ్ల కోసం సుదీర్ఘంగా ఎదురుచూస్తున్న లబ్ధిదారుల కుటుంబాల్లో కాంగ్రెస్ సంతోషాన్ని నింపిందని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో డబుల్‌బెడ్‌రూమ్‌ల పంపిణీ హామీగానే నిలిచిపోయిందని ఆయన అన్నారు. 28 మంది లబ్ధిదారుల ఎంపిక రాజకీయాలకు అతీతంగా అధికార యంత్రాంగమే చేసిందని చెప్పారు.

యాంటీ లార్వా ఆపరేషన్



సికింద్రాబాద్: దోమల నిర్మూలన కోసం సికింద్రాబాద్ సర్కిల్ పరిధిలో యాంటీ లార్వా ఆపరేషన్ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. సర్కిల్ పరిధిలో బౌద్ధనగర్, సీతాఫల్‌మండి, మెట్టుగూడ, తార్నాక, అడ్డగుట్ట ఐదు మున్సిపల్ డివిజన్లు ఉండగా, డివిజన్‌కి ఆరు ఎంటమాలజీ బృందాలను జీహెచ్ఎంసీ అధికారులు ఏర్పాటు చేశారు. ఒక్కోరోజు ఒక్కో డివిజన్‌లోని ఆరు బృందాల సభ్యులు దాదాపు 1500గృహాలను తనిఖీలు చేస్తున్నారు. ఆయా గృహాల్లో దోమల ఉత్పత్తిని నిలువరించడానికి ఎంటమాలజీ బృందాలు మందులను పిచికారీ చేసి, గృహాల యజమానులకు పరిసరాల పరిశుభ్రత, నీటి నిల్వలు, నిరుపయోగ వస్తువులను తొలగించే అంశాలపై అవగాహన కలిగిస్తున్నారు. ఒక్కో ప్రాంతంలోని గృహాలను వారానికి ఒక మారు సందర్శించి అక్కడి పరిస్థితులను పర్యవేక్షిస్తున్న ఎంటమాలజీ బృందాలు అక్కడి గృహాల గోడలకు సందర్శించిన తేదీ సమయం, వివరాలను నమోదు చేస్తున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

సనత్‌నగర్: కార్మికుల సమస్యల పరిష్కారం కోసం గంజి కేదార్ ఎంతో కృషి చేశారని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. గురువారం సనత్‌నగర్ డివిజన్‌లోని సుందర్‌నగర్ వెల్ఫేర్ కల్చరల్ హాల్‌లో కేదార్ ప్రథమ వర్ధంతిని కుటుంబ సభ్యులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే కేదార్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ పార్టీ నాయకులు బాల్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, సురేష్‌గౌడ్, ఖలీల్, భూపాల్‌రెడ్డి, జమీర్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

త్వరలో 11కేవీ అండర్‌గ్రౌండ్ కేబుల్ నిర్మాణం

సనత్‌నగర్: డివిజన్ పరిధిలోని రాజరాజేశ్వరినగర్, కైలాష్‌నగర్ ప్రాంతాల్లో గురువారం టీజీఎస్‌పీడీసీఎల్ అధికారులు పర్యటించారు. బంజారాహిల్స్ సర్కిల్ ఎస్ఈ కరుణాకర్‌బాబు, డీఈ భీమానాయక్‌లు తమ సిబ్బందితో కలిసి ఆయా ప్రాంతాల్లో పర్యటించి స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కొన్నిచోట్ల స్తంభాలపై భారీగా ఉన్న డిష్ కేబుల్స్‌ను తొలగించి విద్యుత్ సరఫరాకు ఎటువంటి ఆటంకాలు లేకుండా క్లియర్ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఈ కరుణాకర్‌బాబు మాట్లాడుతూ త్వరలోనే 11కేవీ అండర్‌గ్రౌండ్ కేబుల్‌పై అధికారులతో మాట్లాడి పనులు మొదలుపెడతామన్నారు. చుట్టుపక్కల కాలనీల్లో విద్యుత్‌కు సంబంధించి ఏ సమస్యలు వచ్చినా వెంటనే తమకు ఫిర్యాదు చేయాలన్నారు. వారితో పాటు బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు కొలను బాల్‌రెడ్డి, ఏడీఈ వంశీకృష్ణ, ఏఈ శేఖర్, లైన్‌మెన్ మల్లేశ్, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.


సనత్‌నగర్‌లో పర్యటించిన టీజీఎస్‌పీడీసీఎల్ బంజారాహిల్స్ సర్కిల్ ఎస్ఈ కరుణాకర్‌బాబు

మహిళల స్వావలంబనకు కుట్టుమెషన్ల పంపిణీ

కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

సనత్‌నగర్: మహిళలు ఆర్థిక స్వావలంబనకు తనవంతు సాయంగా వారికి శిక్షణ ఇప్పించి, తమ సొంత నిధులతో కుట్టుమెషన్లు అందిస్తామని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. బేగంపేట డివిజన్ మాతాజీనగర్‌లో 100మంది మహిళలకు గురువారం ఎమ్మెల్సీ వాణీదేవితో కలిసి కుట్టుమిషన్లు, సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇప్పటికే కూకట్‌పల్లి నియోజకవర్గంలో 2,000 మందికి పైగా కుట్టుమెషన్లు అందించామని, ఇక ముందు కూడా ప్రతీ సంవత్సరం శిక్షణ ఇప్పించి వారికి కుట్టు మిషన్లు అందించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ బృహత్తర కార్యక్రమంలో పాలుపంచుకుంటున్న ఖార్డ్ సంస్థ అధినేత సుమన్, మంజులత దంపతులను ఆయన అభినందించారు. వారికి శిక్షణ అందించి సరైన నైపుణ్యం అందిస్తున్నందుకు వారు చేసే సేవా కార్యక్రమాలకు తన వంతు సహకారం ఎల్లవేళలా ఉంటుందన్నారు. ఆడబిడ్డల వివాహానికి దేశంలో ఎక్కడా ఇవ్వని విధంగా రూ.1,00116లు ఇచ్చి వారిని ఆదుకోవడం జరిగిందన్నారు. ఎమ్మెల్సీ వాణీదేవి మాట్లాడుతూ.. మహిళలు తమ సొంత కాళ్లపై నిలబడి ఆర్థికాభివృద్ధి సాధించేలా కృషి చేస్తున్న ఎమ్మెల్యే, ఖార్డు స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులను అభినందించారు. కార్యక్రమంలో బేగంపేట కార్పొరేటర్ మహేశ్వరిశ్రీహరి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు సురేష్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి నరేష్, సీనియర్ నేతలు తాళ్ల రాజయ్య, రఘునాథ్, గిరి, శ్రీనివాస్, నారాయణ, సునీత, మాతాజీనగర్ నాయకులు గంగారం తదితరులు పాల్గొన్నారు.


కుట్టుమెషన్లు, సర్టిఫికెట్లు అందిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ వాణీదేవి

విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు

- స్తంభాలకు వేలాడుతున్న కేబుల్ వైర్ల తొలగింపు
- లష్కర్‌లో అమలువుతున్న ప్రత్యేక కార్యాచరణ

సికింద్రాబాద్: నియోజకవర్గంలో విద్యుత్ సమస్యలకు తెరదించేందుకు విద్యుత్‌శాఖ అధికారులు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నారు. విద్యుత్ తీగలు అస్తవస్తంగా మారడం, మొత్తంగా విద్యుత్ స్తంభాలను కేబుల్ వైర్లు, నెట్ సంస్థల వైర్లు ఆవరించి ఉండడంతో సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. వర్షం వచ్చినా, చిరుగాలులు వీచిన సందర్భాల్లో కేబుల్, నెట్ వైర్లకు విద్యుత్ తీగలు అంటుకోవడం, మంటలు చెలరేగడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడుతున్నాయి.

◆ ప్రధాన రహదారుల్లోని కొన్ని ప్రాంతాల్లో అయితే విద్యుత్ స్తంభాలకు చుట్టి ఉన్న కేబుల్ వైర్లు, నెట్ బాక్సులకు దాటుకొని విద్యుత్ సిబ్బంది స్తంభాలను ఎక్కి మరమ్మతులు చేయడం కోసం సర్కస్ ఫీట్లు చేయాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా తార్నాక, సీతాఫల్‌మండి, బౌద్ధనగర్, మెట్టుగూడ ప్రాంతాల ప్రజలు ఇటువంటి సమస్యలతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. విద్యుత్ కోతలకు తోడు సరఫరాలో తరచూ అవాంతరాలు ఎదురవుతున్నాయి. ఇంకొన్ని సందర్భాల్లో విలువైన గృహోపకరణాలు కాలిబూడిద అవుతున్నాయి.

ప్రత్యేక చర్యలు ప్రారంభం

◆ విద్యుత్ స్తంభాల వైర్లను మరమ్మతు చేయడంతో విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం అధికారులు చర్యలు ప్రారంభించారు. కొద్ది రోజులుగా సికింద్రాబాద్‌లోని ప్రధాన రహదారుల్లో పూర్తిగా కిందకు వేలాడుతూ ప్రమాదకరంగా పరిణమించిన వైర్లను బిగించే పనులు ప్రారంభమయ్యాయి.పనిలో పనిగా విద్యుత్ వైర్లకు సమాంతరంగా ఉండి, ప్రమాదకర పరిస్థితులకు హేతువులుగా మారిన కేబుల్ వైర్లను, నెట్ వైర్లను విద్యుత్ అధికారులు తొలగిస్తున్నారు.


తొలగించిన వైర్లు

◆ సికింద్రాబాద్‌లోని పలు ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలకు అస్తవ్యస్తంగా చుట్టిన కేబుల్‌వైర్లను తొలగిస్తున్న అధికారులు గురువారం వారాసిగూడ ప్రధాన రహదారిలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. విద్యుత్ శాఖ ఏఈ రోచిత నేతృత్వంలో విద్యుత్‌శాఖ సిబ్బంది మొత్తంగా విద్యుత్ స్తంభాలకు చుట్టిన ప్రైవేట్ సంస్థల వైర్లను, వైర్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను కూడా తొలగించారు. క్రమేణా సికింద్రాబాద్‌లోని అన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అడ్డగోడలుగా నిలుస్తున్న అన్ని సంస్థల కేబుళ్లను తొలగిస్తామని అధికారులు చెబుతున్నారు.


విద్యుత్ స్తంభానికి బిగించిన ప్రైవేట్ సంస్థల బాక్సులను తొలగిస్తున్న సిబ్బంది